


కోటిగాడు పరిగెడుతున్నాడు.

కళ్ళు ఎరుపెక్కాయి.
పళ్ళు పదునెక్కాయి.
ఒళ్ళు వేడెక్కింది.

ఒక చేత్తో జారిపోతున్న నిక్కరుని పైకి లాక్కుంటున్నాడు. మరో చేత్తో కంకర్రాయిని బిగించి పట్టుకున్నాడు.

కోటిగాడికి కనుచూపు దూరంలో వారిగాడు—

వేటగాడి బారిన పడిన లేడి పిల్లలా. పిల్లి చేత తరుమబడుతున్న ఎలుక పిల్లలా భయంతో ... ఆయాసంతో ... వగరుస్తూ...పరుగు ...

కోటిగాడు తరుముతున్నాడు కసితో ... కోపంతో ... పట్టుదలతో.

"ఎదవ. ఇంతన్యాయం చేస్తాడా? బచ్చాలాటలో ఓడిపోయి వాడు పందెం కాసిన బచ్చాలతోపాటు నాని కూడా పట్టుకొని పారిపోతాడా! ఈడి అంతు చూడాల్సిందే!"

కోటిగాడి కాళ్ళు వత్తువని పుంజుకున్నాయి. వారిగాడికి మరి కొంచెం దగ్గరి కొచ్చాడు.

"ఒరేయ్, కోటిగా."

లక్ష్మీపతిగారి పిలుపు వాడి కాళ్ళకు 'బ్రేక్' వేసింది. మరుక్షణంలో వారిగాడి నెత్తురు చవి చూడాల్సిన కంకర్రాయిని గురి పెట్టిన కుడిచెయ్యి నిలిచిపోయింది.

"ఒరేయ్, ఇలా రా." లక్ష్మీపతిగారు పిల్చారు.

కంకర్రాయిని దూరంగా విసిరేసి పరుగెత్తుకని వెళ్ళి భయపడుతూ లక్ష్మీపతిగారి ఎదుట చేతులు కట్టుకొని నిలబడ్డాడు కోటిగాడు.

లక్ష్మీపతిగారు లక్షల మీద వ్యాపారం చేస్తున్న కంట్రాక్టరు. కోటిగాడు ఐస్‌ఫ్రూటు అమ్ముకొనే రాందాసు కొడుకు. లక్ష్మీపతికి కోటిగాడి లాంటి వాళ్ళ అవసరం రాదు.

"ఆయన తనని దండించడానికే పిలిచారు." కోటి వణికిపోతున్నాడు.

పైడిపాల

"నా తప్పు లేదండి — వారిగాడు నా బచ్చాలు దోచేశాడండి." అడక్కుండానే సంజాయిషీ ఇస్తున్నాడు.

లక్ష్మీపతి చిరునవ్వు నవ్వాడు.

"వెధవ బచ్చా ముక్కలకేంలే — కావలిస్తే నేను నీకు పేకలిస్తాను. నువ్వు బజారు కెళ్ళి కాఫీలు పట్రాగలవా?"

"సిత్తం. తెత్తానండి."

"సైకిలు తొక్కడం వచ్చా?"

"వచ్చండి.

లక్ష్మీపతి లోపలకు రమ్మని సంజ్ఞ చేశాడు. కోటిగాడు గుమ్మం దాటుతూ తన కంటబడిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

టేబిలు చుట్టూ ఆరేడు కుర్చీలు. కుర్చీల్లో లక్ష్మీమానసపుత్రులు. వాళ్ళ చేతుల్లో పేక ముక్కలు. ప్రతివాడి ఎదుట రూపాయినోట్ల గుట్టలు. అయిదులు ... పదులు ... ఇరవైలు ... వందలు — చిత్తుకాగితాల కంటె తేలిగ్గా విసిరేస్తున్నారు.

"నా డ్రాప్ ఇదిగో" లక్ష్మీపతి ఆట కొట్టిన వ్యక్తికి పది రూపాయల కాగితం అందించాడు.

"ఆ ఫ్లాస్కు తీసుకొని ఆరు టీలు శుభ్రంగా చేయించి తీసుకురా" లక్ష్మీపతి కోటిగాడికి పది రూపాయల కాగితం ఇచ్చాడు.

"కొత్త పేకలు కూడా తెప్పించండి" పేకలు పంచబోతున్న బట్టతలాయన కోరిక.

"అవును. వీటి పనయిపోయింది" మరో ఇద్దరు వంత పాడారు. పేక మారిస్తే ఆట పడుతుందని వాళ్ళ సెంటిమెంటు.

"ఇదిగో—ఇలాంటి పేకలు తీసుకురా." ఖాళీ

పెట్టె ఆసవాలుగా ఇచ్చి మరో ఇరవై చేతిలో పెట్టాడు లక్ష్మీపతి.

'పేకలు — టీ'తో ఆ 'పేకల్ క్లబ్' లాంటి భవనంలో అరగంటలో ప్రత్యక్షమయ్యాడు కోటిగాడు. వచ్చీ రాగానే లెక్కచెప్పి చిల్లర తిరిగి ఇచ్చేసి గ్లాసులు కడిగి టీలు అందిస్తున్నాడు.

పేకలు పంచిన అయిదు నిముషాల్లోగా లక్ష్మీపతి 'షో' చేశాడు. ఆడినవాళ్లు గురిపి కౌంట్లు. లక్ష్మీపతికి ఆ ఆటలో దాదాపు ఏడు వందలొచ్చింది.

ఆ మొత్తం లెక్కపెట్టడం చూసిన కోటిగాడు కళ్ళు పచ్చబడ్డాయి.

"అయిదు నిముషాల్లో ఏడొందలు .. అయ్య సంవత్సరం పట్టపగలే కాని రాని డబ్బు. డబ్బు సంపాదితే ఇలాగా తేలిగ్గా కొట్టాలి. తస్సాదియ్యా!"

అలాగా నోట్లకేసి చూస్తున్న కోటిగాడ్ని సిగరెట్లు తెమ్మని పురమాయించాడు అందర్లోకి కుర్రాయన.

"ఈయన్నెక్కడో చూసినట్టుందే ... అవును ... ఎన్నికలప్పుడు వచ్చారు ... కుర్రాళ్ళకి నీతి సూత్రాలు చెప్పి వెళ్ళారే పెద్దమనిషి లాగున్నాడే. నిజంగా ఉంది."

ఇంకో ఇద్దరు కూడా సిగరెట్లు టిఫిన్లు తెమ్మని అయిదు కాగితాలు పడేసి ఆటలో నిమగ్నమయ్యారు.

చెప్పినవన్నీ జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని వాళ్ళు పురమాయించినంత తొందరగా పొట్లాలు కట్టుకొని వచ్చి వాలాడు కోటిగాడు.

కోటిగాడి చలాకీతనాన్ని వాళ్ళు మెచ్చుకున్నారు. 'బాయ్'కి డబ్బులు తియ్యమన్నారు. కోటిగాడికి అర్థమైంది. ముఖం వికసించింది.

ఇక్కడందరూ తనను 'బాయ్' అని పిలుస్తున్నారు. ఈ పిలుపు కొత్తగా కమ్మత్తుగా మర్యాదగా ఉంది.

"ఎంతయినా పెద్దోళ్ళ అలవాట్లే వేరు. ఇంటి దగ్గర 'కోటిగా' అని కేకేస్తారు. ఆ పిలుపుకీ ఈ పిలుపుకీ ఎంత తేడా?" కోటిగాడు ఆనందంలో ఉబ్బి తబ్బిబ్బవుతున్నాడు. పేదరికాన్ని అసహ్యించుకుంటున్నాడు. వాడి కేదో సింహాసనం ఎక్కినట్లుంది.

పేకల పచ్చతోంది ... కొవ్వొత్తులు తెమ్మన్నారు కరెంటు పోయిందేమోనని ముందు చూపు.

ఆ తర్వాత వాళ్ళ చూపు 'మందు' మీదికి మళ్ళింది. ఎవరికి నచ్చింది వాళ్ళు తెమ్మన్నారు. ఆ పైన సోడాలు కొట్టి కలిపి ఇమ్మన్నారు.

వాళ్ళు తాగుతూ ఆడుతున్నారు. ఆడుతూ తాగుతున్నారు. వాగుతున్నారు ... వాళ్ళ పరధ్యానంలో కాలం చీకటి వెలుగు లాడుతూ కాలరే నృత్యం చేస్తోంది...

మళ్ళీ ... మళ్ళీ ... టీలు ... సిగరెట్లు ... కిళ్ళీలు మందు ... కోటిగాడు తిరుగుతూనే ఉన్నాడు. వాళ్ళిచ్చిన టిప్పులతో తింటూనే ఉన్నాడు. తెల్లారిపోయింది. వాళ్ళ మైకం చల్లారిపోలేదు.

డబ్బు పోయిన వాళ్ళు రికవర్ కావాలని ... వచ్చిన వాళ్ళింకా సంపాదించాలని ... ఆశ ... పాశం... అది సంలోపం ... వాళ్ళ కింకా లేవాలని లేదు.

ఒకళ్ళిద్దరి జేబులు ఖాళీ కావడంతో గాత్రం ప్రారంభమయింది. దానితో మిగిలిన వాళ్ళు లేవక తప్పలేదు.

లక్ష్మీపతిగారికి రెండు వేలు లాభంల్నాకి. ఉత్సాహం పరిస్తుంది.

కోటిగాడి కళ్ళు నవ్వుతున్నాయి ... ఒక్క రాత్రితో రెండేళ్ళు ... అయ్యకి ఏడాదు సంవత్సరాల జీతం ... తను కొంప యిలువ ... అక్క పెళ్లి చెయ్యడానికి కావలసిన మొత్తానికి నాలుగురెట్లు.

కోటి చేతిలో లక్ష్మీపతిగారు రెండు వందలు పెట్టారు. రాత్రంతా కష్టపడి సేవచేసినందుకు ప్రతిఫలం.

ఇన్నై రూపాయలు ... ఒక్క రాత్రిలో ఇన్నై రూపాయలు ... నాకో లాగూ సొక్కా ... అమ్మకో చీర ... అక్కకి పరికిణీ ... ఏదైనా కొనవచ్చు ...

ఇన్నై రూపాయలు ... జీవితంలో తన మొదటి సంపాదన ... అమ్మ ఎంత సంబరపడుతుందో ... నాన్న కళ్ళు తేలేస్తాడు. ఇరవయ్యంటే వందకి ఎనభైయేగా తక్కువ!

లక్ష్మీపతిగారి దగ్గర సెలవు తీసుకుని తూనీగలా ఇంట్లో వాలాడు కోటిగాడు.

* * *

గుమ్మంలో అడుగుపెట్టిన కోటిగాడు ఆశ్చర్యపోయాడు! — పది గంటలయినా తండ్రి ఇంట్లోనే ఉన్నాడు. అమ్మనాని కెళ్ళలేదన్న మాట! పిల్లల ఇంట్లో లేదని అక్కని సంగతేమిటని అడిగాడు కోటి.



నీటికి

చిత్రం—ఆచార్య (వరంగల్)

రాత్రి అమ్మా నాన్నా పోట్లాడుకున్నారట ... పక్కింటి వాళ్ళదో పక్షేపంచం డబ్బు రూపాయల్ని నాన్నకాని కొట్టిందట. అది చివగ్గా వచ్చింది నాకు కోపంతో అమ్మ పట్టు ... కొడతా తన పెళ్లాన్ని, ఇప్పటికే అప్పుల్లో ఉన్నావని నాన్న ... మాటా మాటా పెరిగిందట. తంతాలా ... కోపంలా ...

'రాత్రంతా కూడా కుమ్మోలేకుండా ఎక్కడి కెళ్ళావురా?' తల్లి అప్పమ్మ కళ్ళెర్ర జేసింది.

కోటిగాడు మాట్లాడలేదు. నిక్కరు జేబులోంచి రెండు వందలనా తీసి తల్లికి చూపించాడు.

"నా నాయనే ... నా నాయనే ... ఇంత డబ్బు నీ కెడిదిరా?" లాటరీ తగిలినంత సంబరపడిపోతూ కోటిగాడ్ని దగ్గరకు తీసుకొంది అప్పమ్మ.

కోటిగాడు జరిగిన సంగతంతా చెప్పాడు. అప్పమ్మ ఒక పట్టాన నమ్మలేకపోయింది ... కొడుకు అదృష్టజాతకుడని మురిసిపోయింది.

"నీ ముఖాన బిందువు పెంచబడిరా బాబా. నువ్వెప్పటికి కన్నా గొప్పోడి వవుతావు" కొడుకుని తెగ మెచ్చుకుంది.

ఈ విషయం రాందాసు చెవిని పడింది.

"ఆ(... నన్నుబట్టి గాని ఈడి ముఖాన్ని చూసి పిలిచారేటి లక్ష్మీపతిగారు?" అంటూ అక్కడికి చేరాడు.

"అబ్బో ... నీ ముఖమే చెప్పుకోవాలి. కాపరాని కొచ్చి ఇన్నాళ్ళయింది... ఎప్పుడయినా ఇంత డబ్బు నీ ముఖాన చూశానా నేను?" అప్పమ్మ దులదుల లాడింది.

"మహా చెప్పొచ్చావులేవే. మా అయ్య నిన్న రూపాయల మీద నడిపించేశాడు. ఏలు కల్లు మిచ్చేశాడు మరి..." రాందాసు దెప్పి పొడిచాడు.

మళ్ళీ యుద్ధం ప్రారంభమయింది. కోటి తల్లిని శాంతపర్చాడు. ఆ పక్షేపంచా కొనే పూచీ తనమీద వేసుకున్నాడు. పది రూపాయలు ముందుగా కద్దాన్నిగా ఇచ్చి రమ్మన్నాడు. అప్పమ్మకి కొడుకు ప్రయోజకత్వం మీద నమ్మకం కుదిరింది. మిగతా పది రూపాయలు తల్లి దాస్తానంటే కోటిగాడు ఒప్పుకోలేదు. అని తన కమసంచి అట్టే పెట్టుకున్నాడు.

"నిద్దర లేక కళ్ళు ఉబ్బినాయి ... లేచే వణ్ణం తిని తొంగోరా" అప్పమ్మ ఆప్యాయంగా చల్ది పెట్టింది.

రాత్రంతా ఖరీదయిన తిండి తిన్న కోటిగాడికి చల్ది సహించలేదు. రెండు ముద్దలతో అయిందని పించి వాలిపోయాడు. వాలిందే తడవుగా నిద్రలోకి జారిపోయాడు.

నిద్రలో కళ్ళముందు పేకముక్కలూ ... రూపాయలూ ... పక్షేపంచం ...

* * *

"కాయ్ రాజా, కాయ్ ... చూస్తే లేదు — కాస్తే ఉంది ... రూపాయకి రూపాయి .. అయిదుకి అయిదు ... పదికి పది ... ఎంతయినా కాసుకో ... కాయ్ రాజా కాయ్."

సినిమా హాలు ముందు మూడు ముక్కల లాట జోరుగా సాగుతోంది ... చుట్టూ అయిదారుగురు

గుమిగూడి ఉన్నారు.

ఆ గుంపులో కోటిగాడు దూరాడు. కాస్తున్న వాళ్ళ వంక ఎగాదిగా చూస్తున్నాడు. కాసిన వాళ్ళే లాభిస్తున్నారు. ముక్కలు తిప్పేవాడు ఎంత వేగంగా నేర్పుగా తిప్పినా పస్తపోతున్నాడు ...

కోటిగాడి మెదడులో మెరుపులాంటి ఆలోచన... తన దగ్గరున్న పది రూపాయిలూ ఈ ఆటలో పెడితే అరవై రూపాయిలు చెయ్యొచ్చు ... అరవై రూపాయిలు సంపాదిస్తే పట్టెమంచం కొనెయ్యొచ్చు. అమ్మ కోరిక తీరుతుంది. ఆశా? — కాదు, అవకాశమే!

పట్టె మంచం కొనడానికి కావాల్సిన సొమ్ముకోసం తను రెండు వారాలుగా ప్రయత్నం చేస్తున్నాడు. కొన్నాళ్ళు మళ్ళీ లక్ష్మీపతిగారు పిలుస్తారేమోనని చూశాడు. ఆ తర్వాత ఆయన కంట పడాలని చాలాసార్లు వాళ్ళింటి ముందు తచ్చాడాడు... కాని లక్ష్మీపతిగారు కనిపించలేదు.

ఆ తర్వాత తెలిసింది. — లక్ష్మీపతిగారి ఫామిలీ ఆ రోజు వూరికి వెళ్ళడం వల్ల ఇంట్లో ఆడటంలేదనీ, ఆయన వీలు చిక్కితే క్లబ్బుకే వెళ్తుంటారనీ. క్లబ్‌లో వేరే బాయ్ ఉంటాడు. తనని రానివ్వడు. పోనీ క్లబ్‌లో బాయ్‌గా తనని కూడా వేయించమని లక్ష్మీపతిగార్ని ప్రాధేయపడితేనో? ఈ ఉద్దేశంతో తెగించి ఒక రోజు లక్ష్మీపతి గారింటికి వెళ్ళేడు ఆయన జబ్బుపడి హాస్పిటల్లో ఉన్నారట!

అంచేత ఇప్పట్లో మళ్ళీ డబ్బు సంపాదించే అవకాశం లేదు ... కానీ అమ్మ కిచ్చిన మాట పట్టెమంచం ... అరవై రూపాయలు ఎలాగైనా సంపాదించాలి.

గుంపులో ఒకడు పది రూపాయలు కాసి ముక్క తిప్పుతున్నాడు. పదికి పదీ వచ్చాయి.

కోటిగాడికి దారి దొరికింది. ఇందాకట్నుంచీ చూస్తున్నాడు. ఆ చారల పైజామా వేసుకున్న వాడు మూడు ముక్క లాట వాడి కిటుకు కనిపెట్టేశాడు. వాడు కాసినప్పుడల్లా కొట్టేస్తున్నాడు. తన కళ్ళముందు వంద రూపాయల వరకు సంపాదించాడు. తను కూడా ఆ చారల పైజామా వాడు కాసిన దానిమీదే కాస్తే సరిపోతుంది. జేబులో చెయ్యి పెట్టాడు. చేతికి పది రూపాయల కాగితం తగిలింది.

కోటి గాడి కళ్ళ ముందు అయిదు నిమిషాల్లో వీడొంరల ఆట కొట్టిన లక్ష్మీపతి... ఒక్క రాత్రికి రెండు వేలు సంపాదించిన లక్ష్మీపతి... పేక టేబిల్ మీద చిత్తుకాగితాల్లా చేతులు మారిన అంకెలూ... పదులూ ... వందలూ ...

"అవును, డబ్బు సంపాదించాలంటే ఇలాగే కొట్టాలి. అది అరవై కావాలంటే మరో దారి లేదు."

జాగ్రత్తగా నిదానించి దేవుణ్ణి తలచుకొని చారల పైజామా వాడు కాసిన ముక్క మీద ఒక రూపాయి కాశాడు. రూపాయికి రూపాయి వచ్చింది. మళ్ళీ మళ్ళీ కాశాడు.

పది పదిహేనయింది. ఇంక నలభై అయిదు రూపాయలు మాత్రం...కోటిగాడికి ఆత్మవిశ్వాసం గురి పెరిగింది. ఈ సారి రెండేసి రూపాయలు కాయడం మొదలు పెట్టాడు—ఇంకా ఎక్కువ కాయమని చారల పైజామా వాడు ఎగదోస్తున్నాడు.

జూదం ... కాగితాలు చేతులు మారుతున్నాయి. అయిదు ... పది .. పదిహేను నిమిషాల్లో కోటిగాడి పెట్టుబడిలో ఒక్క రూపాయి మినహా మిగతా తొమ్మిదీ హారతి కర్పూరమై పోయాయి.

కోటిగాడి కళ్ళు చెమ్మగిల్లాయి. మొహం మ్లానమైంది. మనస్సులో ఇంకా ఆశ ...

లక్ష్మీపతిగారింట్లో చివరి రెండు రౌండ్లలో పోయిన డబ్బంతా తిరిగి సంపాదించుకున్న బట్టతలాయన కళ్ళముందు మెదిలాడు.

పట్టెనామాల వాణ్ణి మనస్సులో ధ్యానించుకొని చారల పైజామా వాడు కాసిన ముక్క మీద కాకుండా రెండో దాని మీద ఆఖరి రూపాయి కాశాడు. రూపాయికి రూపాయి వచ్చింది.

రెండ్రూపాయలూ అందుకుంటుండగా తన చేతి నెవరో పట్టుకున్నారు. తొట్రుపడి చూశాడు — పోలీసు. అక్కడివాళ్ళంతా కకావికలై పోయారు. పగిలిన గాజు పెంకుల్లా ... చింపివేసిన పేకముక్కల్లా.

పరిగెడుతున్న మూడు ముక్క లాటగాణ్ణీ వాడి గాంగ్‌ని ఎస్. ఐ. తరిమి తరిమి పట్టుకున్నాడు ఆ హడావిడిలో మూడు ముక్క లాటగాడి జేబులో నున్న డబ్బు పట్టుకొని చారల పైజామా వాడు తుప్పలడ్డుపడి ఉడాయించాడు. అంతకుముందే వాడూ గాంగ్‌లో మనిషే నన్న మాట అనుకున్నాడు కోటిగాడు.

కోటిగాడి బుగ్గల మీద కన్నీటి ధారలు ...



లిల

చిత్రం—ఆచార్య (కరీంనగర్)

కాళ్ళలో సన్నని వణుకు ... మాట రావడం లేదు ...

ఎస్. ఐ. సత్యారావంటే ఆ వూళ్ళో హడల్ అతని పేరు చెపితే పసిపిల్లలు పాలు తాగడం మానేస్తారట ... అతను నీతికీ, నిజాయితీకీ మారుపేరు.

"లంజాకొడుకా, నీ కెన్నిసార్లు చెప్పాలిరా— బుద్ధిలేదూ" మూడుముక్క లాటగాణ్ణి ఒళ్ళు హూనమయ్యేలా కొట్టాడు సత్యారావు.

'బాబోయ్, మీకు దణ్ణం ... నన్ను రక్షించండి బాబోయ్' అని ఏడుస్తున్నాడు వాడు. ఆ తర్వాత మిగతా గాంగ్‌ని చితగ్గొట్టాడు ఎస్. ఐ.

"ఏరా, గుంట వెధవా ... నీక్కూడా ఆట కావాల్సొచ్చిందా" జుట్టు పట్టుకొని రెండంటుకున్నాడు. ఇంకా కోపం పట్టలేక లాటీతో కోటిగాడి డొక్కలో ఒక్క పోటు పొడిచాడు సత్యారావు.

"అయ్యో బాబోయ్" కోటిగాడు మెలికలు తిరిగి పోతున్నాడు. వాడి కళ్ళు మూతలు పడుతున్నాయి. కళ్ళ ముందు కరిగి పోతున్న కల ... కాలిపోతున్న పట్టె మంచం.

సత్యారావు నిర్దాక్షిణ్యంగా కోటిగాడితో సహా అందర్నీ వానులో ఎక్కించుకున్నాడు. పోలీసు వాను బజార్లో అందంగా, హుందాగా జనాన్ని చీల్చుకుంటూ ముందుకు దూసుకుపోతోంది ...!

■ ■

రెణ్ణెళ్ళ తర్వాత —

ఒక రోజు లక్ష్మీపతిగారు కబురు పెట్టారు. కోటిగాడికోసం!

ఆశగా, ఆనందంగా ఈసారయినా పట్టె మంచం కొనే డబ్బు సంపాదించగలననే నమ్మకంతో లక్ష్మీపతి గారింటికి వెళ్ళేడు కోటిగాడు.

లక్ష్మీపతిగారింట్లో అడుగు పెడుతున్న కోటిగాడి కో సందేహం — సత్యారావు లాంటి నిప్పులాంటి ఎస్. ఐ. లక్ష్మీపతి బృందం పేకాడితే ఎందుకు పట్టుకోవడం లేదని?

"ఆయన కీ మధ్య ట్రాన్స్‌ఫరయిందని నాన్న చెప్పాడు" జవాబుకూడా వాడే చెప్పుకున్నాడు.

లోపలకు వెళ్ళే సరికే అంతా ఆటలో నిమగ్నమై ఉన్నారు. కోటిగాణ్ని చూసి లక్ష్మీపతిగారేదో చెప్ప బోయారు. అంతలోనే వాడు అదిరి పడ్డాడు. పేకాడుతున్న వాళ్ళలో ఎస్. ఐ. సత్యారావు కూడా ఉన్నాడు. కళ్ళు నులుముకొని మరో సారి చూశాడు — సందేహం లేదు — ఆ నిప్పే!

లక్ష్మీపతిగారు చెపుతున్న దేమీ తనకు వినిపించడం లేదు. బుర్ర పనిచెయ్యడం లేదు. అక్కణ్ణుంచి కోటి వేగంగా బయటకు పరిగెత్తాడు.

ఒకట్లతో మూడు ముక్కలాట ఆడిన తనని శిక్షించి, బుద్ధిచెప్పిన సత్యారావు వందలతో జూదమాడుతున్నాడు ... తన కో న్యాయం.. ఆయన కో న్యాయం ...!

కోటిగాడు పరుగెడుతున్నాడు —

కళ్ళు ఎరుపెక్కాయి ...

పళ్ళు పటపటలాడాయి ...

ఒళ్ళు వేడెక్కింది ...

వాడికి అందనంత దూరంలో వేల మీద కొన్న అసలు పట్టె మంచం ...! *